విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 8, సెప్టెంబరు 2025

సిఎం పర్యటన నేపథ్యంలో పార్కింగ్ స్థలాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి

కలెక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర-అనంతపురం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన నేపథ్యంలో ఆదివారం నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న విజేత మార్ట్ పక్కన, కేశవరెడ్డి స్కూల్‌లో సంఘమిత్ర నగర్ ఎక్స్టెన్షన్, వివిఐపి, విఐపి పార్కింగ్, తదితర 15 ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పలు పార్కింగ్ స్థలాలలో ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పార్కింగ్ స్థలాల్లో ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పార్కింగ్ స్థలాలను శుభ్రం చేయాలని, రోలింగ్ చేయడం, పోల్స్ తొలగించడం, లెవెలింగ్, ఎంట్రీ, ఎగ్జిట్ ఏర్పాటు, మార్కింగ్ చేయడం చేయాలని, వేగంగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, డిఎస్పీ వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఈఈ షాకీర్, సర్వే ఏడీ రూప్ల నాయక్, తహసీల్దార్ హరికుమార్, మండల సర్వేయర్ రఘునాథ్ పాల్గొన్నారు.

2,478 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధం

విశాలాంధ్ర-అనంతపురం : పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా జిల్లాలో 2,478 మెట్రిక్ టన్నుల యూరియా రైతు సేవ కేంద్రాల్లోనూ, ప్రయివేటు వర్తకుల వద్ద పంపిణీకి సిద్ధంగా ఉందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన రైతులందరికీ యూరియా అందించేందుకు చర్యలు తీసుకున్నామని, ఆందోళన చెంద వద్దన్నారు. సోమవారం మన జిల్లాకు 270 మెట్రిక్ టన్నుల పిపిఎల్ కంపెనీకి సంబంధించిన యూరియా 601 మెట్రిక్ టన్నుల కోరోమండల్ యూరియా వస్తుందని తెలిపారు. తహసీల్దార్లు, రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులను జిల్లా స్థాయిలోని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను పర్యవేక్షణ కొరకు ఆదేశించారు. యూరియా పంపిణీ ప్రతి గ్రామంలో కూడా గ్రామస్థాయి కమిటీగా ఆర్ఎస్‌కే సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి, పోలీసు వారి ఆధ్వర్యంలో పంపిణీకి పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లున చెప్పారు. యూరియా కొనుగోలులో ఏవైనా సమస్యలు తలెత్తితే కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8500292992కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు తెలిపారు.

రాప్తాడు మండలం ప్రసన్నాయనపల్లి పంచాయతీ పరిధిలోని అయ్యవారిపల్లి రోడ్‌లో ఉన్న మార్క్ఫెడ్ స్టాక్ స్టోర్ చేసే అవేజ్ గొడౌన్‌ను కలెక్టర్ వినోద్ కుమార్.వి, తనిఖీ చేశారు. గోడౌన్‌కు ఎంత యూరియా వచ్చింది, రైతు సేవా కేంద్రాలకు, పిఎసీఎస్, డిసిఎమ్ఎస్‌లకు ఎంత యూరియా పంపారు.. ఎంత నిల్వ ఉంది, యూరియా పంపిణీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా తదితర వివరాలను ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ అవేజ్ గొడౌన్ నుంచి రైతు సేవా కేంద్రాలకు, పీఏసీఎస్, డీసీఎమ్ఎస్‌లకు యూరియా పంపడంపై దృష్టి సారించాలన్నారు. సీఎంఏఐడి యాప్ ద్వారా యూరియా డిస్పోజ్ సజావుగా చేపట్టాలన్నారు. అధిక ధరల అమ్మకాల జరిగితే 8500292992కు తెలపాలన్నారు.

రైతాంగానికి సరిపడేంత యూరియా సరఫరా చేయాలి

- సోమవారం తలపెట్టిన ఆందోళనను జయప్రదం చేయండి
- చిరుతల మల్లికార్జున పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతాంగానికి యూరియా కష్టాలు మొదలయ్యాయి. ఖరీఫ్‌లో సరిపడినంత యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున విఫలం అయిందని సిపిఐ మరియు ఏపి రైతు సంఘం సోమవారం చేపట్టే ఆందోళనకు జిల్లా రైతాంగం తరలి రావాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున ఒక ప్రకటనలో కోరారు. గత ఏడాది అతివృష్టి, అనావృష్టితో అనంతపురం జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయారు.. విత్తనాలు, ఎరువులు సరైన సమయంలో సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా బ్లాక్ మార్కెట్‌కు యూరియా తరలించడంతో రైతుకు తీవ్ర కష్టాలు వచ్చాయి. బస్తా యూరియా రూ.260 అమ్మాల్సిన యూరియా రూ.350 నుంచి రూ.400కు అమ్మే పరిస్థితి కల్పించారని మండిపడ్డారు. జిల్లాలో 8.50 లక్షల ఎకరాలు సాగుభూమి ఉంటే సాగైంది కేవలం 4.30 లక్షల ఎకరాలు మాత్రమే. గత ఏడాది కంటే ఎక్కువ యూరియా పంపామని.. ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా ఇంకా యూరియా కొరత వేధిస్తోంది. యూరియా కోసం ఎక్కడచూసినా రైతులు బారులు తీరుతున్నారని, మంత్రులు, ప్రభుత్వ అధికారుల అండతో డిస్ట్రిబ్యూటర్లే యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించినా వారిపై చర్యలు శూన్యం అన్నారు. గత ఏడాది నష్టపోయిన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందజేయాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోవడంతో రైతు మరింత అప్పుల్లో కూరుకుపోయాడని పేర్కొన్నారు. సమస్యలపై రైతులు, ప్రతిపక్షాలు మాట్లాడితే యూరియా కొరత లేనప్పటికీ ప్రతిపక్ష పార్టీలు కావాలనే రాజకీయం చేస్తున్నారని చెప్పడం దారుణం అన్నారు, యూరియా కోసం సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో 8న జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాల్లో ఆందోళన నిర్వహిస్తున్నామని ఈ ఆందోళనలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు

విశాలాంధ్ర-యాడికి : తప్పిపోయిన బాలుడిని పోలీసులు గంటలోపే తల్లిదండ్రుల చెంతకు చేర్చిన సంఘటన ఆదివారం యాడికి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పుట్లూరు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తమ్మినేని సునీతమ్మ భర్త రామ్మోహన్‌ల ఏకైక కుమారుడు తమ్మినేని కృష్ణ కుమార్ (6)తో తల్లిదండ్రులతో కలసి యాడికి గ్రామానికి వచ్చాడు. కృష్ణకుమార్ ఆడుకుంటూ ఇంటి నుండి తప్పిపోయి మండల కేంద్రంలోని తిరునాంపల్లి గ్రామ రోడ్డు సమీపంలో ఏడుస్తుండగా అటువైపు వెళుతున్న వ్యక్తి బాలుడిని తీసుకొచ్చి యాడికి పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. యాడికి పోలీసులు గంటలోపే బాలుని తల్లిదండ్రులను గుర్తించి వారికి బాలుడిని అప్పగించారు. పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు నాణ్యమైన వైద్యమందించాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ అనిల్ కుమార్ వైద్యులకు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కాన్పుల గది, ల్యాబ్, ఫార్మసీకి సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు రోగులతో మాట్లాడి వైద్యాధికారులు అందించే వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణ కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు. కాన్పుల గదిలో ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ పనితీరు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ లావణ్య, డాక్టర్ కేశవానంద, సూపర్వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'మే ఐ హెల్ప్ యు'కు పాడె విరాళం

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వారికి ఫౌండేషన్ సభ్యుడు నిచ్చురమెట్ల చంద్రశేఖర్ తన సొంత ఖర్చులతో 8 వేల రూపాయల స్టీల్ పైపులతో పాడెను చేయించి ఆదివారం ఉచితంగా అందించారు. ఈ పాడెను ఉచితంగా యాడికి మండలంలోని వారు ఎవరైనా తీసుకుని వెళ్లవచ్చని, పాడె కావాల్సిన వారు 9912099782, 8686808333 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

విశాలాంధ్ర-ఉరవకొండ: వజ్రకరూరు మండలం చిన్న హోతూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రజిని కుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం ధర్మవరం ఎన్జీవో హోం లో జరిగిన కార్యక్రమంలో సినీ రంగా నటుడు నాగినీడు ఆమెను ఘనంగా సన్మానించి మెమొంటోను అందజేశారు. ధర్మవరం జోన్ యూటీఎఫ్ ఆత్మీయ ట్రస్టు సంయుక్తంగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామప్ప చౌదరి పాల్గొన్నారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులో మిట్స్ కళాశాలకు గుర్తింపు

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (మిట్స్) ఇంజినీరింగ్ కళాశాల అత్యున్నత ప్రమాణాలకు నిలయం గా జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ పేర్కొన్నారు. 2025 సంవత్సరం కు దేశంలో అత్యుత్తమ విద్యాసంస్థల జాబితాను కేంద్ర విద్యాశాఖ తాజాగా విడుదలలో కళాశాలకు ఇంజనీరింగ్ కళాశాలల విభాగంలో 201 నుంచి 300 స్థానం కళాశాలగా గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (యెన్.ఐ.ఆర్.ఎఫ్) 2025 యూనివర్సిటీలు, కాలేజీలు, రీసెర్చ్ ఇన్స్టిట్యూషన్లు, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, మెడికల్.. మొత్తం 13 విభాగాల్లో ర్యాంకులకు ప్రకటించారు. విద్యాసంస్థల్లో అందిస్తోన్న విద్యాబోధన, ఉన్నత ప్రమాణాలు కల్పిస్తున్న సౌకర్యాల ఆధారంగా కళాశాలకు ఈ ర్యాంకును కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని ఆయన అన్నారు. జాతీయస్థాయిలో కళాశాల వైభవం విజయాన్ని సాధించడం పట్ల కళాశాల సిబ్బందికి, సహకరించిన కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంవత్సరమే కళాశాల డీమ్డ్ యూనివర్సిటీగా మారిందని మరింత ఉత్సాహంతో ప్రపంచ స్థాయి లో ఒక గుర్తింపుకు పాటుపడతామని యూనివర్సిటీ ఫౌండర్, ఛాన్సలర్ డాక్టర్ యెన్.విజయ భాస్కర్ చౌదరి అన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్‌కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు.

అన్నదాతల నడ్డివిరుస్తున్న కూటమి ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

విశాలాంధ్ర-గుంతకల్లు : అన్నదాతలకు యూరియా ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం రైతులను నడ్డి విరుస్తుందని వైసీపీ మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రాం రెడ్డి మండిపడ్డారు. ఆదివారం స్థానిక వైసీపీ సమన్వయకర్త వై.వెంకట్రామిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ముందుగా ఎరువులు బ్లాక్ మార్కెట్ పై అన్నదాత పోరు వాల్ పోస్టర్లను రిలీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని యూరియా ఇవ్వకుండా రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారని అన్నారు. వైసీపీ తరఫున పోరాటాలు చేస్తే అప్పుడు తల్లికి వందనం ఇచ్చారు.. రైతుల తరఫున పోరాటాలు చేస్తే రైతులకు ఎరువులు అరకొరగా ఇచ్చారని, ఉచిత బస్సులో మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, మహిళలకు గ్యాస్ ఇచ్చారే గాని వారి అకౌంట్లో డబ్బులు పడు తున్నాయో లేదో కూడా అర్థం కాని పరిస్థితి ఉందని వీటిపై కూడా పోరాటానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. రైతులకు యూరియా ఇవ్వకుండా టీడీపీ నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. జగన్ హయంలో రైతులకు రైతు భరోసా కేంద్రాల నుండి విత్తనాలు, యూరియా, పెస్టిసైడ్స్‌లు సంవృద్ధి గా అందించిన ఘనత వైసిపిదని అన్నారు. క్యాన్సర్ వస్తుందని యూరియా వాడకూడదని రెండు లక్షల టన్నులు యూరియా కట్ చేశా మని చంద్రబాబు నాయుడు చెప్పడం బాధాకరం అన్నారు. 9న నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ మున్సిపల్ చైర్మన్ ఎన్ భవాని, వైస్ చైర్మన్ నైరుతి రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జింకల రామాంజనేయులు, కౌన్సిలర్లు లింగన్న, సుమో భాష, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గిద్దమాబు, వైసీపీ సీనియర్ నాయకులు లంబనూరు, పాల్గొన్నారు.

దేశానికి వెన్నెముక.. వ్యవసాయం : అనంత రాముడు

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: దేశానికి వెన్నెముక వ్యవసాయం అని అనంతపురం జిల్లా పండ్ల తోటల సంఘం అధ్యక్షుడు, అనంతలక్ష్మి కళాశాల చైర్మన్ ఎం.అనంతరాముడు పేర్కొన్నారు. కరోనా సమయంలో వ్యవస్థలన్నీ నిలిచిపోయిన.. వ్యవసాయ రంగంలో రైతు మాత్రం నిత్య శ్రామికుడిగా.. దేశ ప్రజలకు అన్నం పెడుతూ.. ప్రగతి ఫలాలను అందిస్తూ ఉన్నాడు అన్నారు. విద్యార్థి దశలోనే వ్యవసాయం పై అనంతలక్ష్మి పాఠశాలలో విద్యార్థులకు పండ్ల మొక్కల సాగు విధానంపై క్షేత్ర పర్యటన లో వాస్తవిక విషయాలను.. విద్యార్థులకు చేరువచేసి.. అన్వేషణ చేస్తే.. మార్పుకు శ్రీకారం చెడుతున్నామన్నారు. వ్యవసాయ క్షేత్రంలోకి తీసుకువెళ్లి కూరగాయలు, పండ్ల మొక్కల సాగు విధానం, సేంద్రీయ పద్ధతిలో వాటిని ఎలా పండించాలో వివరించారు. పరికరాలను , సేంద్రీయ ఎరువుల వినియోగం గూర్చి ప్రత్యక్షంగా రైతులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం సేంద్రీయ పద్ధతిలో పండించే పండ్లను, కూరగాయలను తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం జరిగిందనీ, విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ క్షేత్ర పర్యటన దోహదపడిందని తెలిపారు.

రజకులపై దాడి సిగ్గుచేటు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి
రజక వృత్తిదారుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

విశాలాంధ్ర- అనంతపురం: శ్రీకాకుళం జిల్లాలో రజకులపై దాడి చేయడం సిగ్గుచేటు అని, రజకుల భద్రత కోసం రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సమాఖ్య అనంత జిల్లా అధ్యక్షులు జిల్లా కార్యదర్శి సివి హరికృష్ణ, సి.నాగప్ప డిమాండ్ చేశారు ఆదివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏపీ శ్రీకాకుళం జిల్లాల కొత్తవలస గ్రామంలో వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా కల్లంగి కులస్తులు, ఒకే కుటుంబానికి చెందిన రజకులపై తీవ్రస్థాయిలో దాడి చేయగా ఆరు మందికి తలలకు గాయమై ఆస్పత్రి పాలయ్యారు. ఈ సంఘటనలో 68 ఏళ్ల పైబడిన ఒక రజక మహిళ దారుణ హత్య చేయడాన్ని అనంత జిల్లా రజక వృత్తి దారుల సమాఖ్య తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రజకుల పైన అత్యధిక దాడులు జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి సంఘటనలపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. రజకుల్ని ఎస్సీ జాబితాలకు చేరిస్తే ఇలాంటి సంఘటనలు జరగవని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా నాయకులు ఆటో ఆదినారాయణ, సిరాజు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

సిఫారసు మేరకే యూరియా వాడండి

విశాలాంధ్ర-అనంతపురం: ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసిన పంటలకు వ్యవసాయ అధికారులు సిఫారసు చేసిన మేరకే యూరియా వినియోగించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణచైతన్య సూచించారు. ప్రసన్నాయపల్లి గ్రామ రైతులతో యూరియా, ఎరువు వాడకంపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూరియా, ఇతర ఎరువులు పొలంలో కలుపు తీసిన తరువాత వేయాలని... లేకపోతే నత్రజనిని ఎక్కువ శాతం కలుపు మొక్కలు తీసుకుంటా యన్నారు. అత్యవసర పరిస్థితులలో నేలలో యూరియా వేసే అవకాశం లేనప్పుడు 2శాతం యూరియా ద్రావణం పిచికారి చేయాలన్నారు. యూరియా వాడకం తగ్గించడానికి పచ్చిరొట్ట ఎరువులైన జనుములు, జీలుగలు, పిల్లిపెసర వంటి వాటిని పంట కాలానికి ముందుగా వేసుకొని 50శాతం పూత దశలో కలియదున్నడం వలన నత్రజని అధిక స్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. భూసార పరీక్షల అనుగుణంగా అవసరం మేరకు ఎరువులు వాడటం వలన నేల ఆరోగ్యం కాపాడుకోవటమే కాకుండా తక్కువ ఖర్చుతో పంట ఉత్పత్తులను పొందే అవకాశం ఉందన్నారు. ఏఈఓ సుజిత, వీహెచ్ఏ సోనీ పాల్గొన్నారు.

వైసీపీ పరిశీలకుడుగా తిప్పేస్వామి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : వైసీపీ నియోజకవర్గాల పరిశీలకుల నియామకం చేపట్టింది. ఇందులో భాగంగా కళ్యాణదుర్గానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామిని గుంతకల్, అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిశీలకుడుగా నియమించింది. తన నియామకానికి సహకరించిన పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త తలారి రంగయ్యకు బోయ తిప్పేస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ఆపద సమయం.. సంబర్ల సాయం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: నిత్య జీవితంలో ఎప్పుడు ఏలాంటి ఆపద కలుగుతుందో తెలియని స్థితి మనం ఉన్న ప్రాంతంలో ఎవరు ఉండకపోవచ్చు. ఈ సమయంలో వివిధ రకాల టోల్ ఫ్రీ నెంబర్లు మనకు రక్షణగా నిలుస్తాయి. 24 గంటలు అందుబాటులో ఉంటాయి. వీటికి సమాచారంఅందిస్తే తక్షణమే సహకారం అందుతుంది. అందులో కొన్ని సేవలు

1930: సైబర్ నేరగాళ్ల.....బారిన పడి మోసపోతే తక్షణమే ఈ నంబరుకు (జాతీయ హెల్ప్ లైన్) ఫోను చేయాలి. బ్యాంకు ఖాతా నుంచి నగదు ఇతరుల ఖాతా లకు మళ్లించుకున్నా.... డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరించినా.. ఇతరులు ఫోను చేసి మోసం చేసినా దీనికి సమాచారం అందించాలి. వెంటనే అధికారులు ఆ సొమ్మును ఫ్రీజ్ చేస్తారు. దీనివల్ల మన డబ్బు క్షేమంగా ఉంటుంది.

1912....ఇవి విద్యుత్తు సరఫరాలో ఎటువంటి లోపాలు తలెత్తినా, లో-ఓల్టేజి, బిల్లులు సక్రమంగా రాకపోయినా దీనికి సమాచారం అందించాలి. ఫలితంగా పరిష్కారం పొంద దానికి వీలు కలుగుతుంది.

101.... అగ్నిమాపక అధికారుల సేవలు పొందదానికి ఈ నంబరు ఉపయోగపడుతోంది. అనుకోకుండా అగ్ని ప్రమాదాలు ఏర్పడినా, గ్యాస్ లీకేజీ, ఎవరైనా నీటిలో మునిగిపోతున్నా సమాచారం అందించి రక్షణ పొందొచ్చు.

1098... బాల కార్మికుల గుర్తింపు, చిన్నారుల అక్రమ రవాణా, బాల లపై లైంగిక వేధింపులు, చిన్నపిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడినా వీరికి సమాచారం ఇవ్వొచ్చు. ఇటు వంటి వారిని గుర్తించి రక్షణ కల్పిం చడమే కాకుండా, అవసరమైతే సంరక్షణ కేంద్రాలకు తరలించి ఆశ్రయం కల్పిస్తారు.

181.... మహిళల భద్రతలో భాగంగా గృహ హింస, లైంగిక, వరకట్నం వేధింపులకు సంబం ధించి ఈ ఫోను నంబరుకు సమా చారం ఇస్తే తక్షణమే స్పందించి, ఘటనా స్థలానికి చేరుకుని న్యాయ పరమైన సలహాలతో పాటు బాధితులకు అండగా ఉంటారు.

100.... నేరం, ప్రమాదం జరిగినప్పుడు చరవాణి, ల్యాండ్ లైన్ ద్వారా దీనికి ఫోన్ చేయడంతో మీకు దగ్గరలో ఉన్న పోలీసులు సహాయం చేయడానికి ఎఅవకాశం ఏర్పడుతుంది.

సీఎం సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-గుంతకల్లు : సూపర్ సిక్స్ సూపర్ హిట్‌లో భాగంగా ఈనెల 10న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం పర్యటనను విజయవంతం చేయాలని గుంతకల్ టీడీపీ మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి పిలుపునిచ్చారు ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభక టీడీపీ పట్టణ నాయకులు, మండల నాయకులు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు.

సీఎం సభకు భారీగా తరలిరండి

విశాలాంధ్ర-యాడికి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం పర్యటనను విజయవంతం చేయాలని ఆదివారం యాడికి మండల టీడీపీ అధ్యక్షుడు గొర్తి రుద్రమ నాయుడు పిలుపునిచ్చారు. 10వ తేదీన అనంతపురంలో జరిగే బహిరంగ సభలో పార్టీ కూటమి ఎమ్మెల్యేలు అందరూ పాల్గొంటారని .. నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలను అమలుచేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడన్నారు. పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరణ

విశాలాంధ్ర-కణేకల్లు: రైతన్నలకు తోడుగా వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన చేపట్టనున్న 'అన్నదాత పోరు'కు సంబంధించి మెట్టు క్యాంప్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైసిపి రాయదుర్గం నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పోస్టర్లను ఆవిష్కరించారు.

'మహానాడుకు మించి సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ'

- చెప్పిన మాట ప్రకారం పథకాలు అమలు చేస్తున్నాం..
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : కడపలో జరిగిన మహానాడుకు మించి అనంతపురంలో సూపర్ సిక్స్-సూపర్ హిట్ విజయోత్సవ సభ ఉంటుందని.. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. సెప్టెంబర్10న అనంత నగరంలోని జీఎంఆర్ మైదానంలో జరగనున్న సభకు సంబంధించిన ఏర్పాట్లను శ్రీనివాస్ రావుతో పాటు అనంతపురం ఉమ్మడి జిల్లా కూటమి నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, బండారు శ్రావణి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, ఇతర ముఖ్య టిడిపి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. సభ నిర్వహణకు సంబంధించి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, బిజెపి, జనసేన కలిసికట్టుగా ఎన్నికల ముందు ప్రచారం చేశామని.. ప్రజలకు నిర్దిష్టమైన హామీలు ఇచ్చామన్నారు. ఆ హామీలన్నీ ఇప్పుడు ఆ హామీల్లో కీలకమైనవన్నీ నెరవేర్చామన్నారు. సహజంగా ఎన్నికల ముందు హామీలు అమలు చేసి తాము అన్ని చేసినట్టుగా చెప్పుకుంటారని.. కానీ అధికారంలోకి వచ్చిన 14 నెలల లోపే వంద శాతం హామీలు నెరవేర్చడం అన్నది గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. మరీ ముఖ్యంగా తల్లికి వందనం, ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం పై ప్రతి మహిళ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అందుకే ఈ భారీ బహిరంగ సభ ద్వారా ప్రజలకు తామిచ్చిన హామీలు ఏ విధంగా అమలు చేశామన్నది చెప్పబోతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో పాటు మొత్తం ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కూటమి పార్టీల నాయకులందరూ హాజరవుతారన్నారు. కడపలో మహానాడు తరహాలోని ఈ సభ కూడా విజయవంతం అవుతుందని అన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఈ సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉంటుందని స్పష్టం చేశారు. సుమారు మూడున్నర లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని అందుకు తగిన విధంగా ఇక్కడ సభ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. మొత్తం కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని..మూడు పార్టీల నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలుపై ప్రతి ఇంటా సంతోషం కనిపిస్తోందని..ప్రజలు కూడా స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సంసిద్ధతతో ఉన్నారని పేర్కొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి

www.visalaandhra.com కర్నూలు, సోమవారం 8, సెప్టెంబరు 2025

సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభను సూపర్ సక్సెస్ చేద్దాం

- ముఖ్యమంత్రి సభకు భారీగా తరలిరండి..
- పార్టీ కార్యకర్తలతో మంత్రి సవిత..

విశాలాంధ్ర-పెనుకొండ : అనంతపురంలో ఈ నెల 10న నిర్వహించనున్న ముఖ్యమంత్రి పర్యటనకు పెద్ద ఎత్తున పెనుకొండ నియోజకవర్గం నుంచి తరలివెళ్లాలని మంత్రి సవిత పార్టీ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో నాయకులతో సమీక్ష నిర్వహించారు, ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, పరిశీలకులు మార్క్ ఫెడ్ చైర్మన్ బంగార్రాజుతో కలిసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఈ నెల 10న 'సూపర్ సిక్స్ - సూపర్ హిట్' పేరుతో అనంతపురంలో భారీ బహిరంగ సభను నిర్వహించనుందని.. ఈ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హాజరుకానున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేద్దామని తెలిపారు.

కలసికట్టుగా సభను విజయవంతం చేద్దాం..

విశాలాంధ్ర-అగళి : ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు మండలం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేద్దామని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లా డుతూ 10న 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' పేరుతో అనంతపురంలో భారీ బహిరంగ సభను నిర్వహించనుంది, సభకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హాజరు కానున్నట్లు వెల్లడించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండలోని తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంకు చెందిన 52 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన 26 లక్షల 53,615 రూపాలయ చెక్కులను ఆదివారం మంత్రి సవిత లబ్ధిదారులకు అందజేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి సవిత .. ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, పరిశీలకులు నరసింహారావు, మార్క్ఫెడ్ చైర్మన్ బంగార్రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇది ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ దృక్పథానికి నిదర్శనమని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు త్వరతగతిన పరిష్కరిస్తూ, పేద ప్రజలను వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నామన్నారు.

గోరంట్ల మండలం.. హర్షవర్ధన్ రెడ్డికి రూ. 30 వేలు, ఉమాదేవికి రూ.44 వేలు, పద్మావతికి రూ. 25,350, శివయ్యకు రూ.40,616, లక్ష్మీపతి నాయక్ కు రూ.104,157, భారతమ్మకు రూ.30,028, ఆదెమ్మకు రూ.67,799, బాలకృష్ణకు రూ.237,785 వెంకటేశులుకు రూ. 45 వేలు..

పరిగి మండలం... శైలజకు రూ.20 వేలు, పవన్కు రూ.20, వేలు, వినోద్కు రూ.51 వేలు., శ్రీరాములుకు రూ.55వేలు,చిక్కయ్యకు రూ.51,309, యశోదకు రూ.30వేలు, రామాంజనమ్మకు రూ.31,345, సందీప్కు రూ.1,20,000, అశ్వత్తమ్మకు రూ.42,103, అనిత కు రూ.38,055, ఆదినారాయణకు రూ.41300, సిద్ధమ్మకు రూ.35 వేలు, మంజులకు రూ.75,090, ఈశ్వరప్పకు రూ.42 వేలు, శరత్కు రూ.25,819, వనజాక్షికి రూ.64,264, శంకరప్పకు రూ1,60,685

పెనుకొండ మండలం.. నాగరాజుకు రూ.25 వేలు, బిల్లేశ్వరకు రూ. 41,136, నరసమ్మకు రూ. 30,541, జయప్పకు రూ.1,19,837, జయలక్ష్మి కి రూ.1,05,343, వడ్డీ శ్రీరాములు రూ.70 వేలు, మమతకు రూ.25,438.

రొద్దం మండలం... ఆర్లో చర్ల వెంకట్రాముడు 88,283, లోచర్ల భాస్కర్కు 15000, చెరుకూరు అనితకు 30,028, క్రిష్టప్పకు రూ. 42,000, కలిపి రామలింగకు రూ.41,278, రొద్దం బాలరాజ్కు రూ.45,295

సోమందేపల్లి మండలం.. బాబయ్య రూ.46,136, రవికి రూ.51,309, ధనలక్ష్మి రూ.30028, అశ్వత్ నారాయణకు రూ.103,255, రిత్విక్సాయికి రూ.40,014, రామకృష్ణకు రూ.20 వేలు గువ్వలకుంట రాధాకృష్ణ 68,916 కొలింపల్లి నిర్మల 23920, మాగే చెరువు సుకన్య 28,000, మాగే చెరువు హనుమక్క 21,084, పిడుగు రాజు 67284, శ్రీనివాసరావు 42,993లు అందించారు.

జీ తెలుగు సరిగమప లిటిల్ చాంప్స్‌లో
మెరిసిన ధర్మవరం గాయిని

విశాలాంధ్ర-ధర్మవరం: జీ తెలుగు సరిగమప లిటిల్ చాంప్స్లో ధర్మవరం పట్టణానికి చెందిన విద్యార్థిని అండ్ గాయని లక్ష్మీ చౌదరి తన ప్రతిభను చాటారు. స్థానిక కోర్టు రోడ్డు నందు శ్రీ లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీదారులు గోవింద్ చౌదరి, లక్ష్మీ చౌదరి (అమ్మమ్మ) మనవరాలు, తండ్రి అనంత సయన, తల్లి కీర్తి చౌదరిల కుమార్తె లక్ష్మీ చౌదరి చిన్నతనము నుంచి చదువుతో పాటు ఎనిమిదేళ్లుగా కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యం, లలిత సంగీతములో ఎంతో సాధన చేసి, పలుచోట్ల గుర్తింపు పొందారు. లక్ష్మీ చౌదరి తల్లిదండ్రులు కూడా ఈమె ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. దీంతో జీ తెలుగు సరిగమప లిటిల్ చాంప్స్ లో వెళ్లాలన్న అకుంఠిత దీక్షతో అనంతపురంలో ఆడిషన్ మొదటి రౌండు కు సెలెక్ట్ కావడం, తదుపరి హైదరాబాదులో కూడా సెలెక్ట్ కావడంతోపాటు మెగా అడిషన్ లో ఈనెల 6వ తేదీన జీ తెలుగు టీవీలో జీ తెలుగు సరిగమప లిటిల్ చాంప్స్లో చిన్నారి లక్ష్మీదేవి తన పాటతో అందరినీ అబ్బురపరిచింది. ఆట అనే సినిమాలో ఏల ఏల అనే పాటకు ముగ్ధులైన జడ్జీలు ఎస్పీ శైలజ, అనంత శ్రీరామ్, అనిల్ రావు పూడి, కొణిదల నీ హారిక ఎంతగానో మెచ్చుకొని అభినందనలు తెలియజేశారు. చిన్నారి లక్ష్మీదేవి 12 సంవత్సరాల వయసులో ధర్మవరం సమీపంలోని గొల్లపల్లిలో గల మాంటిస్సోరీ ఎలైట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ఏడవ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు, తాత, అమ్మమ్మలు, పాఠశాల వారు, తోటి విద్యార్థులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

పేదలకు కంటి వెలుగు ప్రసాదిస్తాం

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే మా లక్ష్యమని యువర్ ఫౌండేషన్ అధ్యక్షుడు పీలా నాగేంద్ర, కార్యదర్శి ఆర్. జయరాం, కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. ఆదివారం పట్టణములోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణములో (వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) ఉచిత ఐ.ఓ.ఎల్ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు సికే శ్రీరాములు జ్ఞాపకార్థం వీరి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ వైద్య శిబిరం యువర్స్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ.. శ్రీ సత్య సాయి జిల్లా, నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి బెంగళూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. 90 మంది కంటి రోగులు పాల్గొనగా కంటి వైద్య చికిత్సలు అందించిన పిదప 408 మంది ఆపరేషనుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సుంకు సుకుమార్ సహకారదర్శి రమేష్ బాబు, పి ఆర్ ఓ రాధాకృష్ణ, క్యాంపు చైర్మన్ ఖలీల్, రెహమాన్, చాంద్ బాషా, సత్రశాల మల్లికార్జున, వై కె శ్రీనివాసులు, కోటేశ్వరరావు, షేక్ సికిందర్, నామాల శ్రీనివాసులు, కేతా లోకేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల పరిధిలోని పాపన్న గారి పల్లికి చెందిన టీడీపీ కార్యకర్త సిద్దా రమేష్ నాయుడు అనారోగ్యంతో తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చి మంచానికి పరిమితం అయ్యాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదివారం స్థానిక నాయకులతో కలిసి బాధితుడి ఇంటి వద్దకు చేరుకొని అతన్ని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అధైర్య పడకండి. అండగా ఉంటామని భరోసా ఇచ్చి రూ.50 వేల నగదును బాధితునికి అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు నాయుడు, వేణుగోపాల్, జయచంద్రారెడ్డి, వెంకటేష్, వేమన్న పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-గోరంట్ల: ధర్మవరం ఎన్జీవో హోమ్లో యూటీఎఫ్, ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. గోరంట్ల మండలం నుండి రామకృష్ణ, నాగమణి, నర్మదాను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవార్డ్ మా బాధ్యతను మరింత బాధ్యత పెంచిందని పిల్లలకు ఇంకా మెరుగైన విద్యను అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల యూటీఎఫ్ అధ్యక్షుడు మురళి ప్రధాన కార్యదర్శి రామాంజ నేయులు జిల్లా కార్యదర్శులు కృష్ణప్ప, చాంద్ భాష,నగేష్, కృష్ణమూర్తి దామోదర్ రెడ్డి,పాల్గొన్నారు.

ఆలయానికి ఫ్రీజర్ బాక్స్ విరాళం

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండల కేంద్రంలోని దొరిగల్లురోడ్డులో ఉన్న శ్రీ పార్శ్వ స్ఫటిక లింగేశ్వర స్వామి దేవస్థానానికి రెడ్డెం వెంకటరమణారెడ్డి శవపేటిక ఫ్రీజర్ బాక్స్ను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ముదిగుబ్బ మండల పరిధిలోని ఏ గ్రామానికి చెందిన వారైనా అవసరమైన సందర్భంలో ఫ్రీజర్ బాక్స్ను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సేవను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కదిరి టీచర్స్ క్రికెట్ టోర్నీ విజేత ఎన్ పీ కుంట జట్టు

విశాలాంధ్ర-కదిరి టౌన్: కదిరి ఎస్వీ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నీ ఫైనల్లో ఎన్ పీ కుంట ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు ధర్మవరం జట్టుపై 8 వికెట్ల తేడాతో గెలుపొంది. టోర్నీ విజేతగా నిలిచింది. 13 మండలాలు 13 జట్లు పాల్గొని 21 రోజులపాటు టోర్నీ నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 68 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఎన్.పీ.కుంట జట్టు 11 ఓవర్లలో 2 వికెట్లను కోల్పోయి విజయం సాధించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, హోరాహోరీగా సాగే నేటి రోజువారి కార్యక్రమాల్లో మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు సహాయ పడతాయని తెలిపారు. అనంతరం యస్టియు స్పాన్సర్ చేసిన విన్నర్ కప్‌ను విజయం సాధించిన ఎన్పి కుంట జట్టుకు అందించారు.

ఈ మ్యాచ్లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్గా సందీప్ ఎంపికయ్యాడు. ఈ మ్యాచ్లో ముఖ్య అతిథులుగా ఎంఈఓలు గోపాల్నాయక్, రమణ, సురేష్ బాబు, సాయి, మెంటర్ గంగాధర్ రెడ్డి, ఎంపీ కుంట జట్టు కెప్టెన్ శ్రీనివాసులు, ఎస్.టీ.యూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి, ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి గౌస్ లాజమ్, రుద్రంరెడ్డి, సురేంద్ర, శంకర్ నారాయణ రెడ్డి, ఆజమ్, మనోహర్, లక్ష్మీనారాయణ రెడ్డి, రామమోహన్, శ్రీనివాసులు, లష్కర్ నాయక్, చందు, ఆనంద్‌రెడ్డి, నాగరాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఆర్గనైజర్లు శ్రీనివాసులు, రమణ, ముబారక్,ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

గోరంట్ల జెడ్పీ స్కూల్ పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక

గురువులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1996 నుండి 2000 వరకు 6 వ తరగతి నుంచి 10 వ తరగతి చదివిన 10 మంది విద్యార్థులు ఆదివారం అపూర్వ కలయిక నిర్వహించారు, అలాగే చదువుతున్న రోజుల్లోని విద్యార్థి దశ లోని జ్ఞాపకాలను నెమరు వేసుకొని,ఆట పాటల మధ్య ఘనంగా సమావేశం ఏర్పాటు చేశారు, అలాగే అప్పటి గురువులు రఘురామిరెడ్డి, కుళ్ళాయప్ప,నాగిరెడ్డి, కుళ్లాయిరెడ్డి, సుబ్రమణ్యం, జయ చంద్రారెడ్డి, గోవింద రెడ్డి, జనార్దన్ రెడ్డి, బాలకృష్ణ, ప్రకాష్, శంకర్‌లకు ఘనంగా సత్కరించారు, ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ.. పూర్వపు విద్యార్థులు క్రమశిక్షణతో జీవితం గడిపి,వారివారి పిల్లలకు మంచి విద్యను ఎంత కష్టమైనా.. నష్టమైన అందించాలన్నారు. తమను 25 సంవత్సరాలు గడిచినా గుర్తు పెట్టుకొని మమ్ములను ఆప్యాయంగా పిలిచి, ఘనంగా సత్కరించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. కేవలం ఉపాధ్యాయ వృత్తిలోనే గురు శిష్యుల బంధం బలంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు గురువులకు ఘనంగా పూల మాలలు, శాలువాలతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు,

విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర-ధర్మవరం : విద్యుత్ మీటర్ రీడర్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అనంతపురం వచ్చిన సందర్భంగా మీటర్ రీడర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, ఉమ్మడి అనంతపురం జిల్లా కోశాధికారి దస్తగిరి కొండయ్య మరికొందరు ఆదివారం తమ సమస్యలను తెలుపుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన నారా చంద్రబాబు నాయుడు సూపర్ సెక్స్ సూపర్ హిట్ అనే కార్యక్రమంలో భాగంగా అనంతపురంకి వచ్చుచున్నందున, వారి దృష్టికి మా సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. విద్యుత్ సంస్థను నమ్ముకుని గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని.. అయితే రీఛార్జ్ మీటర్లు వస్తున్న తరుణంలో మీటర్ రీడర్స్ఉపాధి కోల్పోయే అవకాశం అధికంగా ఉన్నందున, విద్యుత్ సంస్థలో ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ మీ న్యాయమైన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోషన్, పని కుమార్‌తో పాటు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న యూరియా ధరలు

మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్

విశాలాంధ్ర-నల్లమాడ : రాష్ట్ర వ్యాప్తంగా రైతులు వ్యవసాయ భోరుభావుల కింద సాగు చేసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసి యూరియా కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారని పుట్టపర్తి నియోజక వర్గ వైసీపీ మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ అన్నారు. ఆదివారం నల్లశింగయ్యగారి పల్లిలో తమ నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఎరువులు కొరత లేకుండా పంపిణీ చేసిన ఘనత వైయస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఈ నెల 9న మంగళవారం పుట్టపర్తి ఆర్డిఓ కార్యాలయము వద్ద ఉదయం 9:30 గంటలకు వైసీపీ ఆధ్వర్యంలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమానికీ వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

అటవీ సంరక్షణలో భాగస్వాములు కండి

విశాలాంధ్రబ్యూరో-శ్రీ సత్యసాయి: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు లక్షల ఎకరాల అడవులను అగ్నికి ఆహుతి కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని మంగళవారం పుట్టపర్తిలో అశోక్ చౌదరి పేర్కొన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త భాస్కర్నాయుడుతో వారు మాట్లాడుతూ నా వంతుగా 50 ఎకరాలలో అడవులు కాలిపోకుండా చూసుకోవడానికి అయ్యే ఖర్చును భరిస్తానని తెలియజేశారు. ఈ మహా యజ్ఞంలో ప్రభుత్వాలు రాజకీయ నాయకులు పరిశ్రమల యజమానులు వ్యాపారులు, పర్యావరణవేత్తలు బాధ్యత గల పౌరులందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

29న రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-పుట్టపర్తి: ఈనెల 29వ తేదీ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణా నాయక్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు టి. యన్. చేతన్ అధ్యక్షతన సొసైటీ ఎన్నిక జరుగుతుందన్నారు. జిల్లా సాధారణ సభ ఈనెల 29ఉదయం 11.00 గంటలకు పుట్టపర్తి పట్టణం గణేష్ కూడలిలోని జిల్లా సహకార అధికారి కార్యాలయములో నిర్వహించడం జరుగుతుందన్నారు. పోషకులు-ఉప-పోషకులు, జీవితకాల సభ్యులు జీవితకాల అనుబంధ సభ్యులం దరూ తమ ఆధార్ కార్డు, సభ్యత్వ కార్డులతో సదరు సమావేశానికి హాజరు కావాలని కోనివరు. సభలో భాగంగా, కనీసం 10 మంది సభ్యులతో కూడిన శాఖ జిల్లా నిర్వహణ కమిటీ ఎన్నుకోబడుతుందన్నారు. ఈ కమిటీ సభ్యుల నుండి చైర్మన్, వైస్- చైర్మన్, కోశాధికారిని ఎన్నుకుంటారన్నారు. ఈ ఎన్నికలను జిల్లా సహకార అధికారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి పరిస్థితి విషమం

విశాలాంధ్ర-గోరంట్ల: గడ్డి కోయడానికి వెళ్లి కరెంట్ షాక్ తగలడంతో మండలంలోని రెడ్డిచెరువు పల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ నరసప్ప తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఆదివారం ఉదయం 7:30 ప్రాంతంలో లక్ష్మీ నరసప్ప గొర్రె పిల్లలకు గడ్డి కోయడానికి పొలాలలోకి వెళ్ళాడు. అయితే మొక్కజొన్న పంటకు అడవి పందులు వస్తుండడంతో పంటను కాపాడటానికి అక్కడ కరెంటును మొదలుగా గడ్డి కోస్తున్న లక్ష్మీ నరసప్పకు కరెంట్ షాక్ తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు, చుట్టుప్రక్కల వారు కనుగొని గోరంట్ల ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు.

ఆక్రమణలు తొలగించడంలో నిర్లక్ష్యం

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్త చెరువులో నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణలు తొలగించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య అధికమవుతున్నది గత జులై నెలలో అక్రమాలను తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడంతో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ ,ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగింపునకు శ్రీకారం చుట్టారు. అయితే ఇందులో కొందరు మాత్రమే వెంటనే తొలగించారని మిగిలిన వాటిని తొలగించుకోవాలని నోటీసులు జారీ చేశారు. అయితే వారు హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో వాటిని నేటికీ తొలగించలేదు. వీటిని తొలగించాలంటే పంచాయతీ రెవిన్యూ అధికారులు పిటిషన్ వేయాలి అయితే వారికి రాజకీయ పలుకుబడితో అధికారులు కూడా వీటి గురించి పట్టించుకోకపోవడంతో రోడ్లు వెడల్పు కార్యక్రమం యధావిధిగా నిలిచిపోయింది. అయితే సత్య సాయి బాబా జన్మదినం నాటికి ఆక్రమణలు తొలగించి నూతన రోడ్డును నిర్మించాల్సి ఉంది అయితే అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఆ పనులు నిలిచిపోయాయి.

ఎరువుల దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర-రొద్దం: తహసిల్దార్ ఉదయ్ శంకర్ కుమార్ ఆదివారం పై అధికారుల ఆదేశం మేరకు స్థానిక ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలో యూరియా అందుబాటులో లేదని, నిల్వ లేవని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఆర్డిటి మైదానంలో 19వ రోజు అటల్ బిహారి వాజ్‌పాయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 పోటీలు ఉత్కంఠభరితంగా, హెూరాహెూరీగా కొనసాగాయి. ఆదివారం నిర్వహించిన మూడు ఆసక్తికరమైన మ్యాచుల్లో ఆరు జట్లు తమ ప్రతిభను చాటుకున్నాయి. మొదటి మ్యాచ్లో గొట్లూరు జట్టు , ఎగ్ రైస్ జట్టు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన గొట్లూరు జట్టు 20 ఓవర్లలో 133 పరుగులు 5 వికెట్లు కోల్పోయి ఘనత సాధించగా, ప్రతిగా బరిలోకి దిగిన ఎగ్ రైస్ జట్టు 85 పరుగులకే పరిమితమైంది. ఈ పోరులో 48 పరుగుల తేడాతో గొట్లూరు జట్టు విజయాన్ని సొంతం చేసుకున్నాయి. రెండవ మ్యాచ్లో మేడాపురం ఫ్రెండ్స్ జట్టు .. సోమేందపల్లి - లెవెన్స్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మేడాపురం ఫ్రెండ్స్ జట్టు 70 పరుగులు మాత్రమే సాధించగా, అనంతరం లక్ష్యాన్ని సులువుగా చేధించిన సోమేందపల్లి - లెవెన్స్ జట్టు కేవలం రెండు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ఈ పోరులో 8 వికెట్ల తేడాతో సోమేందపల్లి - లెవెన్స్ జట్టు ఘనవిజయం నమోదు చేసుకుంది. మూడవ మ్యాచ్లో పీ.కే.డి థండర్స్ జట్టు, ఇండియన్ ఆర్మీ సోల్జర్స్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన పీ.కే.డి థండర్స్ జట్టు 122 పరుగులు 4 వికెట్లు కోల్పోయి రాణించగా, అనంతరం లక్ష్యాన్ని చేధించేందుకు బరిలోకి దిగిన ఇండియన్ ఆర్మీ సోల్జర్స్ జట్టు 83 పరుగులకే పరిమితమైంది. ఫలితంగా 39 పరుగుల తేడాతో పీ.కే.డి థండర్స్ జట్టు ఘనవిజయం సాధించింది. రోజంతా జరిగిన ఈ మూడు ఉత్కంఠభరితమైన పోటీల్లో చైతన్య కుమార్ (గొట్లూరు), జై (సోమేందపల్లి-లెవెన్స్), గుండు (పీ.కే.డి థండర్స్) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి "ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్" బహుమతిని అందుకున్నారు. విజేతలకు బీజేపీ నాయకులు, సీనియర్ క్రికెట్ ప్లేయర్లు జ్ఞాపికలు అందజేస్తూ అభినందించారు.

రక్తదానం మరో ఇద్దరికి ప్రాణదానం

విశాలాంధ్ర-ధర్మవరం : రక్తదానం మరో ఇరువురికి ప్రాణదానమవుతుందని ఏపీఎస్ఎఫ్ బండి శివ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పట్టణంలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో రజిని ట్రస్టు, రక్త బంధం ట్రస్ట్ వారి సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదాతకు లక్ష రూపాయల ఇన్సూరెన్స్ కూడా కల్పించడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు బండి శివ సెల్ నెంబర్ 8142441568కు, కన్నావెంకటేష్ 9731135903కు సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులతో మమేకం కావాలి

ప్రముఖ తెలుగు సినీ నటుడు నాగినీడు

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయులు అనుసంధానంలో ఉంటేనే ఆ విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకుంటాడని ప్రముఖ తెలుగు సినిమా నటుడు వెల్లంకి నాగినీడు తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో హెూంలో ఆదివారం ఆత్మీయ ట్రస్ట్, యూటీఎఫ్ ధర్మవరం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో తల్లిదండ్రుల్లా, స్నేహితుల్లా ఉన్నట్లు వారితో ఆకర్షణ అయ్యేలా ఉండాలన్నారు. అప్పుడే ఆ విద్యార్థి ఉపాధ్యాయులకు అనుసంధానం అయ్యి మీరు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకుంటారని తెలిపారు. ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయుల్లో 68 మందిని ఎంపిక చేసి పురస్కారాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర యూటీఎఫ్ సహ అధ్యక్షులు సురేషకుమార్ 68మంది ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులకు సినీ నటుడు నాగినీడు చేతులమీదుగా మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. పెనుకొండ డీవైఈఓ జాన్‌రెడ్డప్ప, ధర్మవరం ఎంఈఓలు రాజేశ్వరిదేవి, గోపాల్ నాయక్, చిలమత్తూరు. ఎంఈఓ హనుమంతరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

నిరుద్యోగి ఆత్మహత్య..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని గోసుల భార్గవ (25) జీవితం మీద విరక్తి చెంది నిరుద్యోగిగా తాళలేక, 6వ తేదీ రాత్రి సమయంలో ఇంటి మేడ పైన గల ఒక గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గోసుల భార్గవ కొన్ని నెలల కిందట ఓ మొబైల్ షాపులో పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఐదేళ్ల క్రితం ఓ ప్రమాదంలో కాలు విరిగిపోయి వైద్యులు రాడ్ అమర్చారు. దీంతో వికలాంగుడైన తాను ఏ పని చేయలేకపోతున్నానని మదన పడేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లోని మేడ మీద గదిలో ఉరివేసుకున్నాడు. కాగా 7వ తేదీ ఆదివారం ఉదయం కొడుకును టిఫిన్ చేసేందుకు రమ్మని పిల్చడానికి వెళ్లిన తల్లిదండ్రులకు కుమారుడు ఉరి వేసుకున్న దృశ్యం కలచివేసింది. మృతునికు ఇద్దరు చెల్లెలు. ఇందులో ఒకరికి వివాహం జరిగింది. మరొకరు బీటెక్ ప్రథమ సంవత్సరం తిరుపతిలో కొనసాగిస్తున్నారు. తండ్రి సాంబ శివుడు కూడా ఏడాది క్రితం మృతి చెందాడు. టూ టౌన్ సిఐ రెడ్డప్ప కేసు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా నందమూరి తారకరామా మోక్షజ్ఞ పుట్టినరోజు

విశాలాంధ్ర-ధర్మవరం : నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి తారక రామా మోక్షజ్ఞ 32వ జన్మదిన వేడుకలను ఎన్బికె ఫ్యాన్స్ వారు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు సిద్దయ్య గుట్టలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్.బి.కె ఫ్యాన్స్ హరికృష్ణ, కత్తె నాగరాజు, విజయ్ మాట్లాడుతూ నందమూరి కుటుంబం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సేవలను నిర్వహిస్తూ, రాష్ట్ర ప్రజలకు మదిలో నిలవడం జరిగిందన్నారు. ముందు మరిన్ని సేవలను కూడా మోక్షజ్ఞ చేపడుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్బికె ఫ్యాన్స్ విజయ్ శివా, నజీర్, వెంకటేష్, నారాయణస్వామి, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 8, సెప్టెంబరు 2025

యాడికి పెద్దమ్మ తల్లికి భాద్రపదమాస పౌర్ణమి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని మెయిన్ బజార్లో పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పౌర్ణమి ప్రత్యేక పూజలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నూతన వస్త్రాల సమర్పణ, ఖడ్గమాలాధారణ భక్తి పాటలతో భజన కార్యక్రమం మహా మంగళహారతి నిర్వహించారు. పెద్దమ్మ తల్లికి జై అనే నినాదాలతో ఆలయ ప్రాంతమంతా మార్మోగింది. అదేవిధంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో ప్రతి పౌర్ణమి లాగానే శ్రీరామ సత్యనారాయణ వ్రతం 11 దంపతుల చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా మహాలయ పౌర్ణమి వేడుకలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : మండలంలోని వివిధ గ్రామాల్లో మహాలయ పౌర్ణమి వేడుకలను ఆదివారం ఆ గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గోవిందవాడ, దర్గా హొన్నూరు, ఉద్యహాల్, గోనెహాళ్, నేమకల్, బొమ్మనహాళ్ తదితర గ్రామాలో మహాలయ పౌర్ణమి వేడుకలు జరిగాయి.

పెన్నహోబిలం ఆలయం మూసివేత

విశాలాంధ్ర-ఉరవకొండ: చంద్రగ్రహణం కారణంగా ఉరవకొండ మండలం పెన్నహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు మూసి వేస్తున్నట్లు ఆలయ ఇన్చార్జ్ కార్య నిర్వహణ అధికారి తిరుమలరెడ్డి తెలిపారు. స్వామివారికి సంప్రోక్షణ, అభిషేకం తర్వాత సోమవారం ఉదయం 9 గంటల నుంచి భక్తులు తిరిగి దర్శనం చేసుకోవచ్చన్నారు.

అందుబాటులో ఉన్న యూరియాను అర్హులైన రైతులకు అందించాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఫర్టిలైజర్ షాపుల డీలర్ల వద్ద నిల్వ ఉన్న యూరియాను అర్హులైన రైతులకు ఆధార్ మరియు పొలం పాస్ బుక్‌ను ఆధారంగా చేసుకుని బయోమెట్రిక్ ద్వారా యూరియాను అందించాలని ఉరవకొండ డివిజన్ వ్యవసాయ అధికారి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం విడపనకల్లు మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ షాపులను ఆయన సందర్శించి వారితో చర్చించారు. మండలంలో 25 టన్నుల ఏరియా అందుబాటులో ఉందని యూరియా మండల పరిధిలోని రైతులకు మాత్రమే పంపిణీ చేయాలన్నారు. అర్హులైన రైతుకు రెండు బ్యాగులు పంపిణీ చేయాలన్నారు. యూరియా కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాలు మరియు ఫెర్టిలైజర్స్ డీలర్ ను సంప్రదించి పొందవచ్చు అన్నారు. యూరియా సరఫరా లో ఎక్కడైనా అక్రమాలు జరిగితే అలాంటి డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

9న రైతు పోరును జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఉరవకొండ: రైతాంగం సమస్యలపై కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ, ఈనెల 9న గుంతకల్లు ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టనున్న రైతు పోరు నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ఉరవకొండ వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు పోస్టర్లను విడుదల చేశారు. ఆ పార్టీ జిల్లా నాయకులు రాకెట్ల అశోక్‌కుమార్, వీరన్న, పార్టీ రైతు సంఘం నాయకులు మోపిడి సర్పంచ్ సిద్ధప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల సమస్యలపై కనీస శ్రద్ధ చూపలేదని ఎరువుల సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని ధ్వజమెత్తారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం రేణుమాకులపల్లి గ్రామ సమీపంలోని చింత తోపు వద్ద ఆదివారం జూదం ఆడుతున్న ఏడు మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఉరవకొండ ఎస్సై జనార్దన్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూదమాడు తున్న వారి వద్ద నుంచి రూ.4390 నగదు 6 మొబైల్స్ మరియు ఏడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. జూదమాడుతున్న నలుగురు వ్యక్తులు సంఘటన స్థలం నుంచి పరారయ్యారని వారిపై కూడా కేసు నమోదు చేశామన్నారు.

అన్నదాత పోరుబాట పోస్టర్ల ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుడిబండ: మండల కేంద్రంలోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం దగ్గర జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి శివకుమార్, వైసిపి పార్టీ మండల అధ్యక్షుడు డిఎల్ యంజారేగౌడ్, స్థానిక సర్పంచ్ కరుణాకర్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాత పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర రైతాంగాన్ని నట్టేట ముంచారని, పండించిన పంటలకు ధరల స్థిరీకరణ లేక, ఎరువులు సరఫరా చేయలేక కాలయాపన చేస్తున్న ఈ ప్రభుత్వ తీరుపై వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన పెనుగొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట అన్నదాత పోరుబాట ధర్నా చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో గుడిబండ వైసిపి పంచాయతీ అధ్యక్షుడు నాగేంద్ర, రామచంద్ర, రామాంజి, నాచేపల్లి మంజు ఓంకార్, రాహుల్, బుడిగి రంగప్ప, రంగధామప్ప, సయ్యద్, నాగమణి, కరినింగప్ప, చంద్రప్ప, పరమేష్, ఈడిగ మంజునాథ్,గొల్లపల్లి శేఖర్ పాల్గొన్నారు.

గుంతలమయం కనేకల్..ఉరవకొండ రహదారి

విశాలాంధ్ర-కణేకల్లు : కనేకల్ నుండి మాల్యం మీదుగా ఉరవకొండ వెళ్లే దారి అధ్వాన్నంగా తయారైంది. చినుకు పడిందంటే చాలు ఈ దారి అంతా బురదమయంగా మారుతోంది. గుంతలతో నిండిపోయి వర్షపు నీటిలో గ్రామస్తుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నది. రాయదుర్గం నుండి ఉరవకొండకు వెళ్ళుటకు ఈ దారి ఒకటే మార్గం. ఈ దారిలో కనేకల్ గ్రామం దాటగానే వేదవతి హగిరి దగ్గర ఉన్న డేసెట్ కాలువ దగ్గర ఈ తారు రోడ్డు అంతా గుంతల మయం, ఈ దారిలో బస్సులు ట్రాక్టర్లు వాహనాలు టిప్పర్లు పెద్ద పెద్ద బండ్లు కూడా ఇదే దారి గుండా వెళ్లవలసిందే. ఈ దారిలో ఏదైనా బస్సు గానీ లారీ గుంతో చిక్కుకున్నదంటే అంతే సంగతులు. ఏ వాహనం కూడా పోయేదానికి కూడా దారి ఉండదు.. ప్రయాణం నరకప్రాయమే. అలాంటిది ఈ దారిలో కనేకల్ దాటగానే హగిరి వేదాతి వరకు ఇదే గుంతలమయంతో దారి పొడుగునా వాహన డ్రైవర్లు అవస్థలు పడుతూ అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని వెళ్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ దారికి మోక్షం కల్పించాలని నూతన రహదారి నిర్మాణానికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-అనంతపురం: ఈనెల 08వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు మెసేజ్ వస్తుందని తెలిపారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్‌ను వాట్స్అప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్‌మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్‌కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు కరెక్ట్‌గా పూరించ వలెన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం.ఏపీ.గోవ్.ఇన్ (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రజకుల సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-తాడిపత్రి: ఉమ్మడి విశాఖ జిల్లా వైజాగ్‌లో ఆదివారం రాష్ట్రంలో ఉన్న రజకుల సమస్యలపై రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, మాజీ ఎమ్మెల్యే దువాలకు రామారావు అధ్యక్షతన ఉమ్మడి విశాఖ రజక సేవా సంఘాల ఆధ్వర్యంలో ఆకాంక్ష సభ-2 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎక్సైంజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, బిజెపి విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే కృష్ణకుమార్ రాజు, గుంటూరు ఎమ్మెల్యే గళ్ళ మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. రజకుల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర రజకులకు వారధిగా నిలబడి ప్రభుత్వంతో పని చేయించుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. రాబోవు రోజుల్లో రజకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేం దుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. అనంతరం విశాఖ రజక సేవా సంఘాల సభ్యులు తాడిపత్రికి చెందిన రజక కార్పొరేషన్ డైరెక్టర్ యల్లన్న రామాంజనేయులును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్స్, అనంతపురం ఆయా జిల్లాల రజకులు పాల్గొన్నారు.

అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతం చేయండి

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్

విశాలాంధ్ర-గోరంట్ల: అన్నదాత పోరు కార్య క్రమాన్ని వైసీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయ వంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్ కోరారు. ఆదివారం గోరంట్ల మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రైతన్నలకు బాసటగా సెప్టెంబర్ 9న జరగనున్న ఎరువుల బ్లాక్ మార్కెట్ పై చేపట్టనున్న "అన్నదాత పోరు"కార్యక్రమ పోస్టర్‌ను గోరంట్ల మండల పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి ఉషశ్రీ చరణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటేష్, పట్టణ కన్వీనర్ మేదర శంకర్, జడ్పీటీసీ పాలే జయరామ్ నాయక్, ఎంపీపీ ప్రమీల మూర్తి,వార్డు సభ్యులు సుబహాన్,మాజీ సింగల్ విండో చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, రంగా రెడ్డి, పులేరు సురేష్ రెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు,గోరంట్ల మండల ప్రజా ప్రతినిధులు, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నట్టేట మునిగిన రైతాంగం

విశాలాంధ్ర-అమరాపురం: మండల కేంద్రంలోని వైయస్సార్ విగ్రహం వద్ద ఆదివారం మడకశిర నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ఎస్ ఎల్ ఈరలక్కప్ప ఆధ్వర్యంలో పార్టీ మండల కన్వీనర్ త్రిలోకనాథ్ అధ్యక్షతన వైసీపీ నాయకులు రైతు పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఈరలక్కప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర రైతాంగం నట్టేట మునిగిపోయారన్నారు. పండించిన పంటకు ధరల స్థిరీకరణ లేక పంటలకు ఎరువులు సరాపర చేయలేక కాలయాపన చేస్తున్న ఈ ప్రభుత్వంపై ఈ నెల 9వ తేదీన పెనుగొండ ఆర్డీఓ కార్యాలయం ముందు రైతు పోరుబాట ధర్నా చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న మడకశిర తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉప్పరపల్లి శివన్న, నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షులు శివకుమార్ పంచాయతీల కన్వీనర్లు, పంచాయతీల ఇన్చార్జీలు మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు సర్పంచులు వాగేష్, గోవిందరాయప్ప, సదానంద గౌడ, నరసింహమూర్తి, ఎంపీటీసీలు హనుమంత రాయ, నారాయణ గౌడ, శాంతా మణి, నాగభూషణ్, మంజునాథ్, కేంచప్ప పాల్గొన్నారు.

రైతు పోరుబాట పోస్టర్ల ఆవిష్కరణ

విశాలాంధ్ర - అగళి : మండల కేంద్రంలోని వైయస్సార్ విగ్రహం వద్ద ఆదివారం వైఎస్ఆర్సిపి మడకశిర నియోజకవర్గం సమన్వయకర్త ఎస్ ఎల్ ఈరలక్కప్ప ఆధ్వర్యంలో వైస్సార్సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి నాయకులు రైతులు పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఈరలక్కప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర రైతాంగం నట్టెట మునిగిపోయారన్నారు. పండించిన పంటకు ధరల స్థిరీకరణ లేక పంటలకు ఎరువులు సరాపర చేయలేక కాలయాపన చేస్తున్న ఈ ప్రభుత్వంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన పెనుగొండ ఆర్డిఓ కార్యాలయం ముందు రైతు పోరుబాట ధర్నా చేపడుతామన్నారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ కన్వీనర్ మహీంద్రా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయకుమార్, మాజీ సింగల్ విండో మాజీ అధ్యక్షులు జయరామప్ప, ఎంపీటీసీ సభ్యులు మంజుల సతీష్, లింగమ్మ బసవరాజు,మాజీ జెడ్పిటిసి శివన్న సర్పంచులు ముద్దరాజు శివకుమార్, మంజుల నటరాజ్ సరస్వతి వెంకటస్వామి, బసవరాజు,రామకృష్ణప్ప, కృష్ణప్ప, రామన్న, మధు ఎంపీటీసీ సభ్యులు విమల సదానంద ఆరాధ్య, వినయ్, లింగరాజు, నాగేంద్రప్ప, కొమరేపల్లి ఈరన్న, భోజే గౌడ్

సూపర్ సిక్స్-సూపర్ హిట్ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-అమరాపురం: సూపర్ సిక్స్-సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 10వ తేదీన అనంతపురం పట్టణంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ విచ్చేయుచున్న సందర్భంగా ఆ కార్యక్రమాన్ని మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో దిగ్విజయం చేసేందుకుగాను ఈ కార్యక్రమానికి సంబంధించి తెలుగుదేశం జనసేన బిజెపి కార్యకర్తలు నాయకుల సమావేశాన్ని అమరాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు రేపు ఉదయం 11గంటలకు సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని..

అమరాపురం మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగల్ విండో అధ్యక్షులు గణేష్, కార్యదర్శి నాగరాజు తెలిపారు. కావున అమరాపురం మండలంలోని తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జులు మాజీ ప్రస్తుత జెడ్పీటీసీ ఎంపీటీసీ సర్పంచ్ లు ప్రజాప్రతినిధులు డీలర్లు ఫీల్డ్ అసిస్టెంట్లు వీవోఏలు తెలుగుదేశం పార్టీ అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

రైతులకు యూరియా పంపిణీ

విశాలాంధ్ర-అగళి : మండలంలోని రైతులకు అవసరమైన యూరియాను ఆదివారం పంపిణీ చేశారు. యూరియా రైతు సేవకేంద్రంలో అందుబాటులో ఉందని ఈ విషయంలో రైతులెవరు ఆందో ళన చెందవలసిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. మండలంలోని ఇరిగేపల్లి 2, అగళి గ్రామల రైతు సేవా కేంద్రాల్లో ఆదివారం మండల తహసిల్దార్ సుబ్బారావులతో కలిసి రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఏఓ నాగరాజు మాట్లాడుతూ అగళి, ఇరిగేపల్లి 2,రైతు సేవ కేంద్రాల కు సంబంధించి ప్రస్తుతం 280 బస్తాలు యూరియా స్టాక్ రావడం జరిగిందని ఈ రెండు సచివాలయాల్లోని అర్హులైన రైతులకు రిజిస్ట్రేషన్ చేయించి ఆయా రైతులకు యూరియా ను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మండలంలోని మిగిలిన గ్రామ పంచాయతీలకు కూడా త్వరలోనే ప్రభుత్వం యూరియాను పంపించడం జరుగు తుందని. ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాల యంలోని అర్హులైన అవసరమున్న రైతులను గుర్తించి వారికి అవసరమైన మేరకు ఎరువులను పంపిణీ చేయడం జరుగు తుందని ఈ విషయంలో ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా రైతులు పంట అవసరం మేరకు మాత్రమే యూరియా వాడాలని, నానో యూరియా నానో డీఏపీ వాడాలని దాన్ని ఉపయోగించే విధానాలు దాని ప్రాముఖ్యత దాని ఉపయోగించడం వల్ల కలిగే లాభాల గురించి రైతులకు చాలా క్లుప్తంగా వివరించారు.

టీడీపీ నాయకుడు మృతికి నివాళులర్పించిన కదిరి ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మడక వెంకటరమణ మృతి చెందిన విషయం తెలియడంతో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ వారి స్వగృహానికి వెళ్లి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ దండే రవి శంకర్,మాజీ సర్పంచ్ శ్రీరాములు నాయుడు,వేమన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ : మద్యం కేసులో రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉంటూ మధ్యంతర బెయిల్‌పై విడుదలైన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని ఆదివారం హైదరాబాదులో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు వై.ప్రణయ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు.

కళ్యాణదుర్గంలో ఆలయాలు మూసివేత

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం అన్ని ప్రధాన ఆలయాలు మూసివేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి, ఆంజనేయ స్వామి దేవాలయం, శివాలయాలతో పాటు ప్రధాన ఆలయాలను మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయ తలుపులు తెరిచి ఆలయ సంప్రోక్షణ, శుద్ధి అనంతరం దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తామని పూజారులు చెప్పారు. పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు.

సీఎం బహిరంగ సభకు ఏర్పాట్లు పరిశీలించిన నాయకులు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: ఈనెల 10న అనంతపురం సమీపంలో సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్.. సూపర్ హిట్ బహిరంగసభ జరుగనుంది. ఆదివారం సభావేదిక వద్ద గ్యాలరీలు, వేదిక ఏర్పాట్లను టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ తో కలిసి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పరిశీలించారు. అనంతపురం నగరం శ్రీనగర్ కాలనీ జీఎమ్ఆర్ గ్రౌండ్స్‌లో రాష్ట్రంలో మొట్టమొదటి విజయోత్సవ సభ సూపర్ సిక్స్.. సూపర్ హిట్ బహిరంగ సభ కోసం ఏర్పాటు చేసిన వేదిక, కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలు, విఐపీ గ్యాలరీలు, అధికారుల గ్యాలరీలు, సభా వేదిక వద్దకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వచ్చే మార్గం, అధికారులు వచ్చే మార్గం, కూటమి పార్టీ నాయకులు వచ్చే మార్గాలను దగ్గరుండి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌కి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు చూపించారు.

ఘనంగా కాలభైరవ స్వామి పూజలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని స్వయంభు కాలభైరవ స్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు పూజారి ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. పాలాభిషేకం కూడా నిర్వహించారు. తదుపరి దోష నివారణ పూజలతో పాటు దీపోత్సవ కార్యక్రమం, కంకణ ధారణ కార్యక్రమాన్ని కూడా పూజారి నిర్వహించారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వైయస్సార్ విగ్రహ్ వద్ద ఈనెల 9వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు దుర్గమ్మ సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ అన్నదానం చేస్తూ ఆకలి తీర్చాలని, రక్తదానం చేస్తూ ప్రాణదాతలు కావాలని, ప్రతి జీవికి సహాయం చేస్తూ మానవత్వాన్ని చాటుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం శ్రీ చౌడేశ్వరి దేవి సేవా సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తెలిపారు.

నిత్య అన్నదానం చేయుట మా లక్ష్యం

శ్రీకృష్ణ చైతన్య భక్త భజన మండలి

విశాలాంధ్ర-ధర్మవరం: నిత్య అన్నదానం చేయుట మా లక్ష్యమని శ్రీకృష్ణ చైతన్య భక్త భజన మండలి.. సిద్దయ్య గుట్ట నిర్వాహకులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివారం రోజున అవధూత తిక్క నారాయణ స్వామి ఆశ్రమంలో నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా దాతలు కీర్తిశేషులు దాసరి సంజీవయ్య, భార్య దాసరి రంగమ్మ ,కూతురు రామాంజనమ్మ, విజయ కుమారి, కుమారుడు జగదీష్, కోడలు యాని వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతిరోజు దాదాపు 150 మందికి అన్నదానం కార్యక్రమాన్ని దాతల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని, సహకరిస్తున్న దాతలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలను చేపట్టినప్పుడే మానవతా విలువలు పెరుగుతాయని తెలిపారు. ఆసక్తి గల దాతలు ఎవరైనా ఉంటే సెల్ నెంబర్ 9000854468కు గాని 8019882198కు సంప్రదించాలని సూచించారు.